క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాకటౌన్: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న నైట్ వాచ్ మెన్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి స్వాతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి ఇంగ్లిష్, తెలుగు, హిందీ మాట్లాడడం, రాయడంలో ప్రావీణ్యం కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తిగల మహిళలు తమ దరఖాస్తులను 18వ తేదీ నుండి 22వ తేదీ వరకు పాఠశాలలో స్వీకరిస్తామని పేర్కొన్నారు.

తల్లికి తలకొరివి పెట్టిన కుమార్తె



దహన సంస్కారానికి వెళ్తున్న కూతురు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఓ తల్లికి అన్నీ తానై కూతురే దహన సంస్కారాలు నిర్వహించింది. ఈ ఘటన మండల పరిధిలోని రామునిపట్లలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆనరాశి రంగవ్వ గుండెపోటుతో మృతి చెందింది. ఆమెకు కుమారులు లేకపోవడంతో కూతురు యాదవ్వ తన తల్లికి దహన సంస్కారాలు నిర్వహించింది. ఈ ఘటన గ్రామస్తులను కలచివేసింది.

రూ.2లక్షల ఆర్థిక సాయం



బాధితురాలికి డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న ఉద్యోగులు

దుబ్బాక: దుబ్బాక 108లో పైలట్(డ్రైవర్)గా విధులు నిర్వహిస్తూ మరణించిన కైరంకొండ లింగం కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర 108, 102 ఎఫ్ఎస్‌హెచ్ ఉద్యోగులు అండగా నిలిచారు. వారు సేకరించిన రూ.209,535 విరాళాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసి ఆ పత్రాలను లింగం కుటుంబానికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్, సిద్దిపేట జిల్లా ఎగ్జిక్యూటివ్ ఆఫ్రజ్, 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ నాయక్, కార్యదర్శి దేవేందర్ రావు, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు రవీందర్, దుబ్బాక బాధ్యులు ఎల్లప్ప, ఆస ప్రభాకర్, నాగరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఎవరికి చెప్పాలి?



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 16, 17వ వార్డుల విభజన వల్ల తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు. ఈ మేరకు వారు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్యకు గురువారం వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గత మున్సిపల్ ఎన్నికలకు ముందు 8వ వార్డు పరిధిలోని శివాలయం కాలనీలో కొంత భాగాన్ని 16వ వార్డులోకి, మరికొంత భాగాన్ని 17వ వార్డులో చేర్చారన్నారు. దీంతో శివాలయం కాలనీ ప్రాంతం 16, 17 వార్డుల మధ్య విభజన కావడంతో తమ కాలనీ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక నాలుగున్నర సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు వినోద్, హన్మంతు, రాములు, నరేశ్, ప్రసాద్, ప్రశాంత్, ప్రభుదాస్, యాదగిరి, సంతోష్, వనపతి తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు



చెట్ల కొమ్మలను తొలగిస్తున్న నేతలు

గజ్వేల్‌రూరల్: మూలమలుపుల వద్ద ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను బీజేపీ నాయకులు తొలగించి సమస్యను పరిష్కరించారు. మండల పరిధిలోని అక్కారం నుంచి దాతర్‌పల్లి మీదుగా రిమ్మనగూడకు వెళ్లే మార్గంలో మూలమలుపుల వద్ద చెట్ల కొమ్మలు రోడ్డుపైకి పెరిగాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతూ వచ్చారు. దీంతో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు బారు అరవింద్, దాతర్‌పల్లి బూత్ అధ్యక్షుడు రాజులు జేసీబీ యంత్రం సహాయంతో గురువారం చెట్ల కొమ్మలను తొలగించారు. దీంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు వారిని అభినందించారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తనీయొద్దు



దౌల్తాబాద్ (దుబ్బాక): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



దుబ్బాకటౌన్: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చేర్యాల(సిద్దిపేట): కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం ప్రకాశ్

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

దౌల్తాబాద్ (దుబ్బాక): మండల పరిధిలోని శేరిపల్లి బందారం, దీపాయంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వడ్ల కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన దౌల్తాబాద్‌లోని హనుమాన్ ఆలయం, దీపాయంపల్లిలోని పెద్దమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మండల పాక్స్ చైర్మన్ వెంకట రెడ్డి, మండల గిర్దావార్ పి.ప్రభాకర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రహీమొద్దీన్, నియోజక వర్గ బీఆర్ఎస్ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్, మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు నర్రా రాజేందర్, దండోరా శివరాజు, పడాల రాములు, లాలు తదితరులు పాల్గొన్నారు.

దళారులకు అమ్మి మోసపోవద్దు

చేర్యాల(సిద్దిపేట): గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని ఐకేపీ ఏపీఎం ప్రకాశ్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని ఆకునూరులో స్వయంకృషి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు తక్కువ ధరకు అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఏ గ్రేడ్ 2,320, కామన్ గ్రేడ్ 2,300 పొందాలని సూచించారు. అలాగే ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించిందని, ఆకునూరులో సన్న వడ్లను కూడా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీ దేవయ్య, ఎంఎస్ అధ్యక్షురాలు సుజాత, వీఓ అధ్యక్షురాలు, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

ఒకే కేంద్రం.. రెండు పార్టీల నేతలు ప్రారంభం

దుబ్బాకటౌన్/సిద్దిపేటరూరల్: దుబ్బాక వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులు పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేశ్, ముగ్గురు డైరెక్టర్లు కలిసి గురువారం ఉదయం ప్రారంభించారు. అదే కేంద్రాన్ని సాయంత్రం బీఆర్ఎస్ నాయకులు పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, 10మంది డైరెక్టర్లు, కౌన్సిలర్లు కలిసి ప్రారంభించారు. ఒకే కేంద్రాన్ని రెండు పార్టీల నాయకులు ప్రారంభించడం చర్చకు దారితీసింది. సిద్దిపేటరూరల్ మండల పరిధిలోని సీతారాంపల్లి, చింతమడక గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను సీసీ భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలన్నారు.

ప్రతి గడపకు కేంద్ర పథకాలు చేర్చండి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి



సిద్దిపేటరూరల్: మాట్లాడుతున్న మోహన్ రెడ్డి

సిద్దిపేటరూరల్/హుస్నాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అన్ని సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరేలా కార్యకర్తలు చొరవ చూపాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రాఘవాపూర్‌లో గురువారం ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని స్థాయిల నాయకులు సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొని 100మందిని సభ్యులుగా చేర్పాలని కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 20మంది బీజేపీలో చేరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సురేశ్ గౌడ్, తిరుమలరెడ్డి, రమేశ్‌గౌడ్, నవీన్, త్రిలోచన్ రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్‌బాబు పాల్గొని హమాలీ కార్మికులు, దుకాణాదారులకు సభ్యత్వాలు నమోదు చేయించారు. రాంప్రసాద్, రాజేందర్ పాల్గొన్నారు.

డీఏలను విడుదల చేయడం ప్రభుత్వ బాధ్యత



సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న నాయకులు, పాల్గొన్న ఉపాధ్యాయులు

టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్

దుబ్బాకటౌన్: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను విడుదల చేయడం ప్రభుత్వ బాధ్యత అని వాటిని వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ డిమాండ్ చేశారు. రాయపోల్ మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు గత ప్రభుత్వం ఇస్తానన్న 5వేల ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. దుబ్బాకలో సీనియర్ నాయకుడు తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. గోవర్దన్ రెడ్డి, కనకయ్య, రాములు, నర్సింహులు గౌడ్, హరీశ్, కరుణాకర్, మెట్టురామ్, యాదయ్య పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రం

హుస్నాబాద్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టభద్రులు సమాజంలో కీలకంగా వ్యవహరిస్తారని, అభివృద్ధికి బాటలు వేస్తారని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజక వర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ డాక్టర్ నరేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో గురువారం పట్టభద్రుల సౌకర్యార్థం ఉచిత ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అర్హులైన పట్టభద్రులంతా తనకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో సిద్దిపేట బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి దేవునూరి రవీందర్ పాల్గొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో పోరాడుతానన్నారు.

బీటీ రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్

మద్దూరు(హుస్నాబాద్): వంగపల్లి నుంచి వల్లంపట్ల ఉప్పరోని గడ్డ గ్రామాలకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని, లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ డిమాండ్ చేశారు. మండలంలోని ధర్మారం, వంగపల్లి గ్రామాల్లో గ్రామశాఖ మహాసభలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మారం నుంచి రేబర్తి గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయాలన్నారు. అలాగే వంగపల్లి నుంచి వల్లంపట్లకు, వంగపల్లి నుంచి ఉప్పరోనిగడ్డకు రోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, రవికుమార్, రమేశ్, సత్తయ్య, రాజన్న పాల్గొన్నారు.

రోడ్డు భద్రత కమిటీల భాగస్వామ్యం అవసరం

ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్



ప్రమాదాలు జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ

కొండపాక(గజ్వేల్): ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా కమిటీల భాగస్వామ్యం అవసరమని ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ అన్నారు. దుద్దెడ శివారులో రాజీవ్ రహదారిపై ఉన్న టోల్ ప్లాజా నుంచి బెజ్జంకి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవక్కపల్లి శివారు వరకు రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్న ప్రదేశాలను గురువారం ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్షించారు. వేగ నియంత్రణ బోర్డులను తక్షణం ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. మెయిన్ రోడ్డుకు వచ్చే అప్రోచ్ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటుచేస్తే ప్రమాదాలను తగ్గించవచ్చని నిర్ధారించారు. ఈ సందర్భంగా సుమన్ కుమార్ మాట్లాడుతూ రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలన్నారు. ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలని సూచించారు. హెచ్‌కేఆర్ డీజీఎం విజయ్ భాస్కర్, ఆర్అండ్‌బీ డీఈ వెంకటేశ్, జేఈ ముజాఫరుద్దీన్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మర్కూక్(గజ్వేల్): అక్రమంగా తరలిస్తున్న 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని చేబర్తి గ్రామంలో గురువారం పట్టుకున్నామని ఎస్ఐ దామోదర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన మాలోతు ప్రవీణ్ తన ఆటోలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో కలిసి దాడిచేశారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యానిధి దరఖాస్తుల గడువు పెంపు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 2024–25 విద్యా సంవత్సరానికి గాను అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం దరఖాస్తుల గడువును 29వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ అధికారి కవిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మృతుడి కుటుంబానికి ప్రతాప్‌రెడ్డి పరామర్శ

మర్కూక్(గజ్వేల్): మండలంలోని నర్సన్నపేటకు చెందిన బాల్‌నర్సయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి గురువారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.35వేలు ఆర్థిక సాయం అందించి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో పాండు, రాంచంద్రం, బాల్‌రెడ్డి, రాజిరెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అలయ్ బలయ్ విజయవంతం చేయండి

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లిలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బెజ్జంకిలో గురువారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి హరీశ్‌రావు పాల్గొంటారని చెప్పారు. లక్ష్మణ్, తిరుపతి, శ్రీనివాస్‌గుప్త, శ్రీనివాస్‌రావు, రాజయ్య, రమేశ్, సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాలయ్య



సిద్దిపేటరూరల్: గుర్రాల గుంది గ్రామ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పాతర్ల బాలయ్యను నియమిస్తూ మండల అధ్యక్షుడు రాజేశం గౌడ్ గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ తనమీద ఉన్న నమ్మకంతో పదవిని ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేలా చూస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.



హుస్నాబాద్: వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రజిత తదితరులు

రామాయణాన్ని వరంగా అందించిన వాల్మీకి

ఘనంగా జయంతి వేడుకలు



గజ్వేల్‌రూరల్: టీపొడితో వాల్మీకి రూపాన్ని చిత్రించిన రామరాజు



సిద్దిపేటజోన్: నివాళులర్పిస్తున్న ఆశ్రిత్

హుస్నాబాద్/చేర్యాల(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్/సిద్దిపేటజోన్/దుబ్బాకటౌన్: పవిత్రమైన రామాయణాన్ని వరంగా అందించిన ఆదికవి వాల్మీకి అని మున్సిపల్ చైర్ పర్సన్ రజిత కొనియాడారు. మున్సిపల్ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్లు పాల్గొన్నారు. చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు చంటి, నరేందర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు పాల్గొన్నారు. రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు టీపొడి(చాయపత్త)తో వాల్మీకి మహర్షి రూపాన్ని చిత్రీకరించారు. రాయపోల్ మండలం రామారంలో మహర్షి వాల్మీకి బోయ సంఘం మండల అధ్యక్షులు మన్నె రాజు వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మన్నె శ్రీనివాస్ పాల్గొన్నారు. సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనుల ప్రారంభంపై హర్షం



మిఠాయిలు పంచుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): కొన్ని యేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కడవేర్గు బ్రిడ్జి నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. దీనిపై బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ మాట్లాడుతూ ఎన్నో యేళ్లుగా పరిష్కారం కాకుండా నిలిచిపోయిన వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, పనులకు శంకుస్థాపన కూడా చేశామన్నారు. తర్వాత జరిగిన పరిణామాల దృష్ట్యా పనుల ప్రారంభం ఆలస్యమైందని, ఈ విషయమై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభమయ్యేలా కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు గ్రామాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలో కార్యకర్తలకు చోటు



మాట్లాడుతున్న కౌన్సిలర్లు, నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇందిరమ్మ కమిటీ సభ్యులుగా కాంగ్రెస్ కార్యకర్తలకు చోటు ఇవ్వడాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు విమర్శించడం సరికాదని కౌన్సిలర్లు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు కనీస గౌరవం ఇవ్వలేదన్నారు. రియాజ్, మహేందర్, ఆంజనేయులు, అక్బర్, సంతోషి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ చట్టాలపై అవగాహన అవసరం



మర్కూక్(గజ్వేల్): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ దామోదర్ పిలుపునిచ్చారు. మండలంలోని దారమకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీ టీమ్ ఆధ్వర్యంలో గురువారం మహిళల చట్టాలు..సైబర్ నేరాలు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రీరాములు, శ్యామల, రాంచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ షోయబుల్లాఖాన్ సేవలు మరువలేనివి

దుబ్బాకటౌన్: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన కలంతో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కలం వీరుడు షోయబుల్లాఖాన్ అని రాయపోల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్ట రాజు అన్నారు. గురువారం షోయబుల్లాఖాన్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సింహులు, గణేశ్, స్వామి, లింగం, శ్రీకాంత్, నవీన్, భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆక్రమణదారులపై చర్యలేవి?

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లిలోగల జంగం మల్లయ్య కుంట శిఖం భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి అంబేడ్కర్ సంఘం మండల ఉపాధ్యక్షుడు బాబు గురువారం ఫిర్యాదు చేశారు. సుమారు రెండెకరాల శిఖంను తిమ్మాపూర్ మండలంలోని రియాల్టర్లు ఆక్రమించుకున్నారని ఆయన వాపోయారు.

◆ పరిహారం చెల్లించాలని వినతి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారం శివారులోని 124 సర్వే నంబర్‌లో భూములు కోల్పోయిన రైతులందరికీ పరిహారమివ్వాలని పలువురు బాధితులు గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో కొంత మందికి ఇచ్చారని, పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని కోరారు.

◆ విజయ డెయిరీ కొండాపూర్ చైర్మన్‌గా తిరుపతి

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని కొండాపూర్ గ్రామ విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడిగా తిరుపతి, ఉపాధ్యక్షుడిగా బావు ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. తిరుపతి మాట్లాడుతూ డెయిరీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. డైరెక్టర్లు రామచందర్, గోపాల్, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యుత్ ఏఈగా చాంద్ పాషా

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు విద్యుత్ ఏఈగా చాంద్‌పాషా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఏఈ రమేశ్‌రాజ్ సిద్దిపేట ఎల్‌టీ ల్యాబ్‌నకు బదిలీపై వెళ్లారు. బెజ్జంకి ఏఈగా పనిచేస్తున్న చాంద్ పాషా ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానన్నారు. విద్యుత్ ఉద్యోగులు ఆయనను సన్మానించారు.

◆ ఒగ్గుకథ శిక్షణ శిబిరం ప్రారంభం

దుబ్బాకరూరల్: అక్బర్‌పేటభూంపల్లి మండలం శ్రీకూడవెల్లి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో సాంస్కృతిక శాఖ సంచాలకుడు హరికృష్ణ ఒగ్గుకథ శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 41రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. ఒగ్గు కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ బీఆర్ఎస్వీ సమావేశానికి చేర్యాల నాయకులు

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన బీఆర్ఎస్వీ ప్రతినిధుల సమావేశానికి చేర్యాల ప్రాంత విద్యార్థి నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశానికి హాజరైన వారిలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్, నాయకులు ఏర్పుల మహేశ్, తాండ్ర సాగర్ తదితరులున్నారు.